మది నిండుగా.. పెద్ద పండుగ

- పల్లెల్లో సంక్రాంతి సందడి
- భోగి వెలుగుల్లో సేదతీరిన ప్రజలు
- కొత్త దుస్తులు ధరించి పిల్లల సంబరాలు

వరుణుడి కరుణతో చెరువులు నిండాయి.. బంజరు భూములు సైతం సస్యశ్యామలంగా మారాయి.. ధాన్యరాశులు ఇంటికి చేరాయి.. రైతు కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరిశాయి.. ఇది కదా నిజమైన సంక్రాంతి అంటూ ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారు.. శనివారం వేకువనే భోగి మంటలు వేసుకున్నారు.. శీతల గాలుల నడుమ వెచ్చగా సేదతీరారు.. సంక్రాంతి పురుషుడికి ఘనంగా స్వాగతం పలికారు.



రొంపిచెర్లలో భోగి మంట వేస్తున్న గ్రామస్తులు

పలమనేరు: ఊరూరా శనివారం ఘనంగా భోగి పండుగ జరుపుకున్నారు. ప్రజలు వీధుల్లో భోగి మంటలను ఉత్సాహంగా వేశారు. తమ కష్టాలు తీరిపోయి అంతా మంచే జరగాలని కోరుకున్నారు. ఇళ్ల ముందు కనువిందుగా రంగవల్లులను తీర్చిదిద్దారు. గొబ్బియల్లో అంటూ గ్రామీణ మహిళలు పాటలు పాడి అలరించారు. పిల్లలు పతంగులు ఎగురవేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అనపకాయ ధరకు రెక్కలొచ్చాయి. స్థానికంగా కిలో అనప ధర రూ.70 దాకా పలికింది.

కిటకిటలాడిన వీధులు

పలమనేరు పట్టణంలోని వీధులు కిటకిటలాడాయి. దుకాణాలు జనంతో కిక్కిరిశాయి. ముఖ్యంగా పూజా సామగ్రి, రంగులు, పశువులకు కొమ్ములకు అలకరించే పెయింట్లు, మెడ గంటలు, కొత్త ముగుదాళ్లు, బెలూన్లు చంకీలు కొనేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు.

ఐజ వీధుల్లో దుస్తుల దుకాణాలు భారీగానే వెలిశాయి. పట్టణంలోని ప్రధాన ఆలయాల వద్ద భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కొన్ని ఆలయాల్లో నేడు గోదాదేవి పూజలు నిర్వహించనున్నారు.

సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

వి.కోట: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాతి పండుగ నిలుస్తుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం భోగి పండుగను కొత్తూరులోని తన నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సతీమణి భాగ్యమ్మ, తనయులు నరేంద్ర, అమరనాథ్ పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు) సంక్రాంతి వేడుకల్లో భాగంగా తొలిరోజు భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలో భోగి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. బైరెడ్డిపల్లెకు ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో వీధులన్నీ సందడిగా మారాయి.

పెద్దపంజాణి: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మహిళలు తమ ఇళ్ల ముందు గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు.

గంగవరం: మండలంలోని ప్రతి ఇంటి ముంగిళ్లలో భోగి మంటలు వేశారు. మహిళలు ఉదయాన్నే ఇంటి ముందు కళ్లాపు చల్లి ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. ఆదివారం సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

గుడుపల్లె: ధనుర్మాసం ప్రారంభం నుంచి చేసిన భజన కీర్తనలను శనివారంతో ముగింపు పలికారు. అక్క దేవతలకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

రొంపిచెర్ల: మండలంలో భోగి పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.





పలమనేరు : రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు, బైరెడ్డిపల్లెలో భోగి మంట, కల్లూరులో ..

క్లుప్తంగా

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

గంగవరం: మండలంలోని గంగ్రాజుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను శనివారం నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు భద్రపరుచుకునే ఫైళ్లు, విద్యాసామగ్రిని బహుమతిగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దొరస్వామికి ఘన నివాళి



దొరస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

గుడుపల్లె: మాజీ ఎమ్మెల్యే బీఆర్ దొరస్వామి నాయుడు 23వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద దొరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీఆర్‌డీ సురేష్, నాయకులు వెంకటరమణ(బాబు), గుల్లేపల్లె రాజారాం, డీకే చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాపిరెడ్డిగారిపల్లెలో కబడ్డీ పోటీలు



పోటీలు ప్రారంభించిన రెడ్డీశ్వరరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెలో శనివారం నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలను హిందూపురం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు రెడ్డీశ్వరరెడ్డి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, వాటర్ షెడ్ చైర్మన్ జంపాల రాజేష్, ఉప సర్పంచ్ మధు, లోకేశ్వరరెడ్డి, ఆర్గనైజర్ కిరణ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీ తెట్టుపల్లె వద్ద శనివారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ మారుతి తెలిపారు. నిందితుల నుంచి రూ.6,690 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

సత్యమ్మకు విశేష పూజలు

శవణంపల్లె: భోగి పండుగ సందర్భంగా మండలంలోని కె.పట్నంలో శనివారం సత్యమ్మకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు దూర్వాసులు రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేణురెడ్డి, ప్రసాద్ రెడ్డి, బాబు రెడ్డి, సుధాకర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవలో మంత్రి పెద్దిరెడ్డి



స్వామిని దర్శించుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు పాళెంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ,ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఇరుముడి చెల్లించిన జెడ్పీ చైర్మన్

వి.కోట: సదుం మండలం ఎర్రాతివారిపాళెంలోని అయ్యప్పస్వామిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆయన స్వగ్రామం కొత్తూరులో ఇరుముడి కట్టుకుని బయలుదేరారు. స్వామిని సేవించుకున్న తర్వాత ఇరుముడి చెల్లించారు.



అయ్యప్ప సేవలో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

కమనీయం గోదాదేవి కల్యాణం

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లెలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి గోదాదేవికి ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. మాసం చివరి రోజైన భోగి పండుగ నాడు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శ్రీకృష్ణుడు, గోదాదేవికి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మార్కెట్ యార్డు పనుల పరిశీలన

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట సబ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులను శనివారం పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాల మేరకు నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరితగతిన యార్డును అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.



ప్రహరీ గోడ పనులను పరిశీలిస్తున్న హేమంత్ కుమార్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న అమాస మోహన్, నాగేశ్వరరావు

సోమల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సోమల దళితవాడలో శివాలయం రాకెట్స్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఆటలో గెలుపోటములు సహజమని గెలిచిన ఓడిన సమానంగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరదం రమణ, ప్రభాకర, సొంబయ్య, ఎంపీ రమణ, కాతమల్లయ్య, ప్రదీప్, ఉపాధ్యాయులు రమేష్, శివరాం పాల్గొన్నారు.

మకర సంక్రాంతి శుభాకాంక్షలు

అన్నదాతల ఆనందమే లక్ష్యం



ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వరుణుడి కరుణతో చెరువుల్లో నీరు పుష్కలంగా ఉందని, అన్నదాతల ఆనందమే లక్ష్యంగా ప్రభుత్వ సహకరిస్తోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. రైతు కుటుంబాల్లో వెలుగులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.













